నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | HANUMAKONDA

సమావేశంలో మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి

బీసీలకు ద్రోహం చేస్తే సహించం

- కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదు
- మళ్లీ పూర్తి స్థాయిలో కుల గణన చేపట్టాలి
- దమ్ముంటే కడియం శ్రీహరి రాజీనామా చేయాలి
- శాసనమండలి పక్ష నేత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి
- కుల గణన రీ సర్వే ఘనత బీఆర్ఎస్‌దే
- పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం

హనుమకొండ, ఫిబ్రవరి 13: బీసీలకు ఇచ్చిన హామీల విషయంలో ద్రోహం చేస్తే సహించబోమని శాసనమండలి పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి హెచ్చరించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోసపూరిత, అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కాస్కో.. కేసీఆర్ త్వరలోనే బయటకు రానున్నాడన్నారు. ఆయన మౌనం పర్యవసానం గురించి సీఎంలు చంద్రబాబు, వైఎస్సార్‌కు తెలుసని పేర్కొన్నారు. బీసీల సంక్షేమం కోసం నిబద్ధతతో బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ ఆలోచన చేసి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేశారన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలన స్వర్ణయుగంలా వెలుగొందిందన్నారు. కుల గణన విషయంలో అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టం తీసుకొస్తారని అనుకుంటే తూతూమంత్రంగా ప్రకటన చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. బీసీల అభ్యున్నతి, రాజకీయ ప్రాతినిధ్యంపై తాను వినయ్ భాస్కర్, మరికొందరితో కలిసి తమిళనాడుకు వెళ్లి అధ్యయనం చేశామని, అక్కడి ప్రభుత్వం స్థానిక సంస్థలు, ఉద్యోగాల్లో 62 శాతం బీసీలకు కేటాయిస్తున్నదన్నారు. లెక్కలు తప్పుగా చూపడంతో బీసీలకు కేంద్రం ఇచ్చే సంక్షేమ పథకాల్లో కోత విధిస్తుందని, వచ్చే నిధుల్లో అన్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కార్మిక, కర్షక, మహిళలు, విద్యార్థులు.. ఇలా ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తిగా లేరన్నారు. శాసనసభ, శాసనమండలిలో తాము మాట్లాడే మాటలకు సీఎం, మంత్రులు తడబడుతున్నారని పేర్కొన్నారు. గత పదేళ్లలో తెలంగాణలో చేపట్టిన వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందని విమర్శించారు. పరిపాలన చేతగాని దద్దమ్మలు కాంగ్రెస్ నాయకులని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇక్కడ కమీషన్లు తీసుకొని ఢిల్లీకి సంచులు మోసుకుపోవడం తప్ప అభివృద్ధిపై ధ్యాస లేదన్నారు. కడియం శ్రీహరికి డిప్యూటీ సీఎం పదవి ఇక్కడున్న ప్రజల వల్లే వచ్చిందని, కానీ ఏ పార్టీ పచ్చగా ఉంటే ఆ పార్టీలోకి రేవంత్ రెడ్డి, శ్రీహరి చేరుతారన్నారు. దమ్ముంటే కడియం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని మధుసూదనాచారి అన్నారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, కార్పొరేటర్లు బోయినపల్లి రంజిత్‌రావు, బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేశ్, కేశవబోయిన అరుణా శ్రవణ్‌కుమార్, మైనార్టీ నాయకులు నయీముద్దీన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లో ఎండగట్టాలి. ఆ పార్టీ నాయకులకు గట్టిగా గుణపాఠం వచ్చేలా బుద్ధి చెప్తాం. లగచర్ల రైతుల తరపున బీఆర్ఎస్ పోరాడి విజయం సాధించింది. అంతేకాకుండా మన పోరాటంతోనే ప్రభుత్వం బీసీ కులగణన రీ సర్వేకు పూనుకుంది. కవులు, కళాకారులకు అందుబాటులో ఉండేలా కేసీఆర్, కేటీఆర్ సహకారంతో రూ. 90 కోట్ల నిధులతో కాళోజీ కళాక్షేత్రం నిర్మిస్తే, ఇప్పుడు వారు ఏదైనా కార్యక్రమం చేయాలంటే రూ. 1.50 లక్షలు తీసుకుంటున్నారు. వ్యాపార క్షేత్రంగా కాకుండా కవులు, కళాకారులకు అందుబాటులో ఫీజులు ఉండాలి. కళాకారులతో సమావేశం నిర్వహించి, కలెక్ట రేట్ ఎదుట ధర్నా చేపడుతాం. పార్టీ ప్రజలందరికి అండగా నిలుస్తుంది.

– దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్‌ఫ్లాప్

- సర్కారుపై సొంత పార్టీ ఎమ్మెల్యేల అసంతృప్తి
- రాహుల్‌గాంధీ పర్యటనను ఆపింది రేవంత్‌రెడ్డే..
- కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలిపోవడం ఖాయం..
- విస్తృతస్థాయి సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి

తొర్రూరు, ఫిబ్రవరి 13 : అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్‌ఫ్లాప్ అయిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలైనా ప్రజల కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయలేదని ధ్వజమెత్తారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని శ్రీనివాస గార్డెన్‌లో గురువారం జరిగిన మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని, వారు ప్రభుత్వాన్ని కూలగొట్టడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విమర్శలు చేయడంతోనే రాహుల్‌గాంధీ పర్యటనను సీఎం రేవంత్‌రెడ్డి అడ్డుకున్నారన్నారు. రేవంత్‌రెడ్డి ఒకసారి గెలిచిన స్థానంలో మళ్లీ గెలవలేరని, ఆయన బ్రోకర్‌గా పని చేస్తూ అందరి దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. మంత్రి అయ్యే అవకాశం కూడా లేదని, కాంగ్రెస్ నాయకులను మభ్యపెట్టి సీఎం కుర్చీ ఎక్కాడని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామని తెలుసుకున్న రేవంత్ రెడి ప్రజలను మభ్య పెట్టేందుకు మళ్లీ వాయిదా వేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో అలజడులు సృష్టించే చర్యలకు పాల్పడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం త్వరలో కుప్పకూలుతుందని హెచ్చరించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయాన్ని సాధిస్తుందని, ఆరు జడ్పీటీసీలు, ఆరు ఎంపీపీలు గెల్చుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. రైతులకు కనీసం సాగునీరు కూడా అందించలేకపోయిందని, కర్కాల బ్రిడ్జి ఎందుకు ఆగిపోయిందో చెప్పాలన్నారు. తొర్రూరులో 100 పడకల ఆస్పత్రి పరిస్థితి ఏమైందని నిలదీశారు. గ్రామ సభల పేరుతో ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతున్నదని ఆరోపించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, నాయకులు పొనుగంటి సోమేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు బిందు శ్రీనివాస్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ ప్రదీప్‌రెడ్డి, కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, ఎన్నమనేని శ్రీనివాసరావు, మణిరాజు, తూర్పాటి రవి శంకర్, జైసింగ్, ఎస్కే అంకూస్, కాలునాయక్, రాయశెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పెంబర్తిలోని విశ్వకర్మ బ్రాస్ సొసైటీలో యంత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కవిత

మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలి

బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంటే ఊరుకోమని.. విద్య, ఉద్యోగాల్లో 46 శాతం చొప్పున, రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఉద్యమాలకు దిగొచ్చిన ప్రభుత్వం బీసీ బిల్లు పెడతామని ప్రకటించిందని, ఇది బీసీలందరి విజయమని వ్యాఖ్యానించారు. మళ్లీ కుల సర్వేకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని, అయితే నెల రోజుల సమయం ఇవ్వాలని కోరారు. రీ-సర్వేపై ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసి, టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. అసెంబ్లీ వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టాలని జాగృతి పదేళ్ల ముందే డిమాండ్ చేసిందని ఆమె గుర్తు చేశారు.

- వేధింపులను పింక్ బుక్‌లో రాస్తున్నాం
- అధికారంలోకి రాగానే ఇంతకింతా చెల్లిస్తాం
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సిందే..
- ఒకటి కాదు.. మూడు వేర్వేరు బిల్లులు పెట్టాల్సిందే..
- సమ్మక్క బరాజ్ పనులు పూర్తిచేయలేని దద్దమ్మ సర్కారు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- పెంబర్తిలో విశ్వకర్మ బ్రాస్ సొసైటీ సందర్శన
- అంబేద్కర్, పాపన్నగౌడ్, దొడ్డి కొమురయ్య విగ్రహాలకు నివాళులు

కాంగ్రెస్ లెక్క తేలుస్తాం

జనగామ రూరల్ : పెంబర్తిలో గాజుల గంప ఎత్తుకొని మురిసిపోతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జనగామ, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : 'కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నది.. అన్నింటిని పింక్‌బుక్‌లో రాస్తున్నాం.. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంతకింతా తిరిగి చెల్లిస్తాం.. లెక్కలు ఎలా రాయాలో మాకూ తెలుసు.. మీ లెక్కలన్నీ బయటకు తీస్తాం.. జాగ్రత్త' అంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. గురువారం జనగామ జిల్లాకు వచ్చిన ఆమె తొలుత పెంబర్తి విశ్వకర్మ హస్తకళల కేంద్రాన్ని సందర్శించి బ్రాస్ సొసైటీ ప్రతినిధులు హస్త కళాకారుల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త రేఖరాజ్‌ను పరామర్శించి, అంబేద్కర్, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాలకు నివాళులర్పించారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి కవిత చేరుకోగా, మున్సిపల్ మాజీ చైర్మన్ పోకల జమున, బీఆర్ఎస్ మహిళా నాయకులు ప్రేమలతా రెడ్డి, అనిత, స్వరూప, సుధ, చెంచారపు పల్లవి, శారదతోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం యశ్వంతాపూర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, సీనియర్ నాయకుడు క్యామ మల్లేశం, కొమురవెల్లి ఆలయ మాజీ చైర్మన్ సేవెల్లి సంపత్, ఇర్రి రమణారెడ్డి, గద్దల నర్సింగరావు, కందుకూరి ప్రభాకర్, వై కుమార్‌గౌడ్ తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో చిన్న విమర్శ చేసినా సీఎం రేవంత్ భయపడుతున్నారని.. పోస్టు చేసిన మరునాడే పోలీసులు ఇంటికి వచ్చి వేధిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు డిక్లరేషన్‌పై నిలదీస్తారని రాహుల్‌గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని, రాజ్యాంగాన్ని జేబులో పెట్టుకొని ఆయన తిరుగుతుంటే.. తెలంగాణలో రేవంత్‌రెడ్డి మాత్రం దానిని ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే దగా, మోసం అని.. ఇస్తామన్న రూ. 2,500, స్కూటీలు ఇవ్వకుండా మహిళలను వేధిస్తున్నదన్నారు. కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్‌లు మాయమయ్యాయన్నారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాల్సిందేనని.. మహమ్మారి కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలను మోసం చేసిందని మండిపడ్డారు. విదేశీ విద్య స్కాలర్‌షిప్ నిధులు కూడా విడుదల చేయని దౌర్భాగ్య పరిస్థితి ఉందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నదని, రైతు భరోసా పేరిట రైతులను మోసం చేస్తున్నదని దుయ్యబట్టారు. రుణమాఫీ పూర్తయిందని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెబుతున్నారని, సంక్రాంతి నుంచి ఇస్తామన్న బియ్యం ఇంకా ఇవ్వలేదని, కాంగ్రెస్ అబద్ధాలను ఎండగడతామని స్పష్టం చేసిన కవిత మళ్లీ అధికారంలోకి బీఆర్ఎస్ వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం..

బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ పట్టుబట్టి సమ్మక్క-సారక్క బరాజ్ పనులను 95 శాతం పూర్తి చేయిస్తే, ఏడాదైనా మిగిలిన 5 శాతం పూర్తి చేయలేని అసమర్థ, చేతగాని, దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల రైతులకు నష్టం జరుగుతున్నదని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమానికి భయపడి 2001లో ఆగమేఘాలపై దేవాదుల ప్రాజెక్టుకు చంద్రబాబు శంకుస్థాపన చేసినా కేసీఆర్ వచ్చాక పనులు పూర్తిచేసి గ్రామాలకు నీళ్లు పారించారని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయించే అంశంపై గతంలో ఇరిగేషన్‌శాఖ మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి ఎందుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదన్నారు. అవకాశవాదం కోసం పార్టీ మారిన కడియం శ్రీహరిని ప్రజలు క్షమించే ప్రసక్తే లేదని, ఉప ఎన్నిక వస్తే అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ సుప్రీం కోర్టులో పిటిషన్ వేసిందని, అనుకూలమైన తీర్పు వస్తుందన్న నమ్మకం ఉందన్నారు. సమావేశంలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు పసునూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధి బీఆర్ఎస్ చలువేనని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. గతంలో మంజూరైన కోట్లాది రూపాయల పనులే ఇప్పుడు చేస్తున్నారని, ఇప్పటికీ ఒక్క పైసా తేలేదన్నారు. సమ్మక్క-సారలమ్మ బరాజ్ నిర్మించి 365 రోజులు నీళ్లుండేలా చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. తొమ్మిది రిజర్వాయర్ల ద్వారా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ప్రాజెక్టుల హబ్‌గా, ఇరిగేషన్‌లో జనగామ నంబర్ వన్‌గా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. రైతు రుణమాఫీ పూర్తిగా జరగలేదని, భరోసా గందరగోళంగా మారిందన్నారు. 420 మంది రైతుల ఆత్మహత్యలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కారణమైందన్నారు. అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, దీనిని సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించిన మనోజ్ రెడ్డిని తప్పుడు కేసులతో జైలు పాలు చేశారని ఆరోపించారు. కడియం శ్రీహరికి ఏ మాత్రం నైతిక విలువలున్నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని సవాల్ చేశారు. తన బిడ్డ రాజకీయ భవిష్యత్ కోసం కేసీఆర్‌ను నమ్మించి మోసం చేశారని, తిన్నింటి వాసాలు లెక్కపెట్టిన ఆయనను ప్రజలు చీదరించుకుంటున్నారని అన్నారు.

బీసీలకు రేవంత్ క్షమాపణ చెప్పాలి

- పదవి కాపాడుకునేందుకే నోరు మెదపని మంత్రి సురేఖ
- కేసీఆర్ పాలనలోనే బడుగులకు న్యాయం
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

ఖిలావరంగల్, ఫిబ్రవరి 13 : బీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. బుధవారం శివనగర్‌లో బీఆర్ఎస్ బీసీ కులాల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే కొండా సురేఖ తన మంత్రి పదవిని కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేస్తున్న మోసంపై నోరు మెదపడం లేదన్నారు. ప్రభుత్వం రీ సర్వే చేయడానికి సుముఖత చూపిస్తున్నదంటే మొదట చేసిన సర్వే వంద శాతం తప్పే అని అంగీకరించినట్లే నన్నారు. 2014లో నాటి సీఎం కేసీఆర్ కుటుంబ సర్వే చేయిస్తే బీసీలు 51 శాతం ఉన్నట్లు గణాంకాలు చెప్పాయని, పదేళ్ల తర్వాత 45.5 శాతం ఎట్లా తగ్గిందో చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో ఓడిపోతామనే భయంతో కాంగ్రెస్ సర్కారు ఎన్నికలను వాయిదా వేసుకొని రీ సర్వే ప్రక్రియ మొదలు పెట్టిందన్నారు. కుల గణనపై రీసర్వే చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, బీసీ సంఘాల నాయకులకు ఆ బాధ్యతలు అప్పగించాలన్నారు. బీసీలకు నష్టం కలిగించే కుట్రలో భాగమే కులగణనలో జనాభాను తక్కువ చేసి చూపించారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కేసీఆర్ బీసీలకు 50 శాతం ప్రకటించి అమలు చేశారని గుర్తు చేశారు. బీసీ కుల గణన సర్వే చిత్తు కాగితాలని మీ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ వాటిని కాల్చారని గుర్తు చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ చేసిన వాగ్దానాలను కరపత్రాలుగా ముద్రించి ఆ పార్టీ కుటిల నీతిని ఎండగడుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను కాంగెస్ బొందపెడుతున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలన్నారు. బీసీల కోసం పోరాటం చేస్తావా లేదా తలదించుకుంటావా.. అని మంత్రి సురేఖ ఆలోచించుకోవాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే గద్దె దిగిపోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌బాబు, మాజీ కార్పొరేటర్లు కుందారపు రాజేందర్, బయ్య స్వామి, దండు దయాసాగర్, రామ రాంబాబు, కొంతం మోహన్, నాయకులు మోడెం ప్రవీణ్, రాజ్‌కిషోర్, రాజబోయిన యాకయ్య, నామాని రాజ్‌కుమార్, వేల్పుగొండ యాకయ్య, బొజ్జ రాజ్‌కుమార్‌తో పాటు బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే నిలదీస్తం
- మాజీ ఎమ్మెల్యే గండ్ర

సమావేశంలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

మోసం చేసినోళ్లకు బుద్ధి చెబుదాం

శాయంపేట, ఫిబ్రవరి 13 : పక్కనే ఉండి మోసం చేసినోళ్లకు బుద్ధి చెబుదామని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ శాయంపేట మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి వరంగల్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలు సెలెక్ట్ అండ్ ఎలెక్ట్ విధానం ద్వారా గెలిపించే బాధ్యత మీదేనన్నారు. కష్టకాలంలో వెన్నంటి ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని పేర్కొన్నారు. అహింసా మార్గం ద్వారా ఈ ప్రభుత్వంపై పోరాటం చేద్దామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడ్తే నిలదీస్తామని హెచ్చరించారు. దేవుళ్ల మీద ఒట్లు వేసి ఒక్కటీ చేయలేదని రేవంత్‌రెడ్డిపై నమ్మకం పోయిందన్నారు. ప్రతి కార్యకర్త స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి మాట్లాడుతూ కార్యకర్తలందరూ కలిసి కట్టుగా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కేసీఆర్‌ను అసెంబ్లీకి రమ్మని పిలుస్తున్నావ్.. కేటీఆర్, హరీశ్‌రావులనే తట్టు కోలేక పోతున్నావ్.. మరి కేసీఆర్ అసెంబ్లీలో అడుగిడితే రేవంత్ కనుమరుగైపోతాడని అన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మెతు కు తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నాయకులు మేకల శ్రీనివాస్, దాసి శ్రావణ్, సుమన్ పాల్గొన్నారు.

నిర్బంధించి.. సర్వే చేసి

- ఎన్‌హెచ్‌కు భూములివ్వమని అడ్డుకున్న తండావాసులు
- పోలీస్ బందోబస్తుతో సర్వే కొనసాగింపు

తండా మహిళను స్టేషన్‌కు తీసుకుపోతున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సలార్ తండాలో గురువారం తెల్లవారుజామున తండావాసులను పోలీసులు నిర్బంధంలో ఉంచి, అధికారులు జాతీయ రహదారి (930పీ) కోసం భూములను సర్వే చేశారు. భారీ పోలీస్ బందోబస్తు నడుమ సర్వేను కొనసాగించారు. అనేక ఏళ్లుగా ఈ భూములను నమ్ముకొని జీవిస్తున్నామని, చావనైనా చస్తాం.. కానీ, జాతీయ రహదారికి తమ భూములను ఇచ్చేది లేదని తండావాసులు భూక్యా అనుసూర్య, కల్యాణి, హచ్చి పేర్కొన్నారు. పచ్చని పంట పొలాలతో పాటు తాము నివాసముంటే ఇండ్ల మధ్య నుంచి వలికొండ టు భద్రాచలం జాతీయ రహదారిని వేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొందరు పలుకుబడి ఉన్న రాజకీయ నాయకుల కోసం డిజైన్‌ను మార్చి కొత్త అలైన్‌మెంట్‌తో సర్వే చేస్తున్నారని, తమ పంట భూములను జాతీయ రహదారికి ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. అనేక సార్లు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. సుమారు 140 మంది ఇండ్లు, పచ్చని పంట పొలాలకు తీవ్ర నష్టం జరుగుతుందని సర్వేను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, తండావాసులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో వారిని కురవి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రైతులకు నచ్చజెబుతున్న పోలీసులు

డబ్బులిచ్చాకే పనులు చేపట్టాలి

- భూములు కోల్పోతున్న రైతుల డిమాండ్
- నిరసనల మధ్యే గ్రీన్‌ఫీల్డ్ హైవేకు మార్కింగ్

శాయంపేట ఫిబ్రవరి 13 : విజయవాడ-నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు మండలంలోని గట్లకానిపర్తి శివారులో నేషనల్ హైవే అధికారులు, సంబంధిత మెగా కంపెనీ ప్రతినిధులు గురువారం మార్కింగ్ చేశారు. అయితే తమకు రేటు ఫిక్స్ చేయకుండానే మార్కింగ్ చేయడంపై భూములు కోల్పోతున్న రైతులు నిరసన వ్యక్తం చేశారు. ధర నిర్ణయించి డబ్బులు ఇచ్చాకే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే మండలంలోని గట్లకానిపర్తి శివారు నుంచి వెళ్తుండగా, సుమారు 34 ఎకరాల భూమిని 85 మంది రైతులు కోల్పోతున్నారు. రైతులు నిరసన వ్యక్తం చేయడంతో వారికి పోలీసులు నచ్చజెప్పారు. హద్దులు మాత్రమే పెడుతున్నారని, పనులు చేపట్టడం లేదన్నారు.

ఎంత సేపు ఆపుతారు?

మేడారంలో మంత్రి సీతక్కను నిలదీసిన భక్తులు

మంత్రి సీతక్కను నిలదీస్తున్న మహిళా భక్తులు

ములుగు, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : మినీ మేడారం జాతర సందర్భంగా సమ్మక్క-సారలమ్మను దర్శించుకునేందుకు వచ్చిన మంత్రి సీతక్కను భక్తులు గద్దెల ప్రాంగణంలో నిలదీశారు. గురువారం మేడారానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ప్రాంగణం రద్దీగా మారింది. ఈ సమయంలో మంత్రి సీతక్క తల్లుల దర్శనం నిమిత్తం రాగా, పోలీసులు భక్తులను నిలిపివేశారు. ఈ సమయంలో తల్లుల సన్నిధికి చేరుకొని అమ్మవార్లను దర్శించుకొని వెళ్తున్న సీతక్కపై అక్కడే వేచి చూస్తున్న మహిళా భక్తులు మండిపడ్డారు. 'నువ్వు మంత్రివైతే ఏంది.. నువ్వు దర్శనం చేసుకునేందుకు మమ్ములను ఎంత సేపు ఆపుతారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి తాను ఇప్పుడే వచ్చానని, దర్శనం చేసుకొని వెళ్తున్నానన్నారు.

ప్రేమికుల దినోత్సవ శుభాకాంక్షలు
ఫెర్టిలిటి సె